నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, సోమవారం 2 సెప్టెంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET


## శ్రీశైలానికి నిలిచిన రాకపోకలు


మూసివేసిన మన్ననూర్ చెక్‌పోస్టు

అమ్రాబాద్, సెప్టెంబర్ 1 : మండలంలోని మన్ననూర్ నుంచి శ్రీశైలం వెళ్లే రహదారిపై ఉన్న మన్ననూర్ చెక్‌పోస్టును అచ్చంపేట డీఎస్పీ ఆదేశాల మేరకు మూసివేయడంతో శ్రీశైలానికి రాకపోకలు నిలిచిపోయాయి. దోమలపెంట, శ్రీశైలం ప్రాజెక్ట్ సమీపంలోని ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగిపడి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ప్రయాణికులు వాయిదా వేసుకోవాలని పోలీసులు, అటవీశాఖ అధికారులు కోరుతున్నారు. ఘాట్ రోడ్డుపై కొండచరియలు విరిగిపడడంతో నేషనల్ హైవే అధికారులు జేసీబీ సాయంతో బండరాళ్లను తొలగిస్తున్నారు.

## ఇల్లు కూలి తల్లీకూతుళ్ల మృతి

- కొత్తపల్లి మండలం ఎక్కమేడ్‌లో ఘటన

మద్దూర్ (కొత్తపల్లి), సెప్టెంబర్ 1 : భారీ వర్షానికి ఇల్లు కూలడంతో తల్లీకూతుళ్లు మృతి చెందిన ఘటన కొత్తపల్లి మండలం ఎక్కమేడ్ గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. ఎక్కమేడ్‌కు చెందిన హన్మమ్మకు ముగ్గురు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. భర్త ఇటీవల చనిపోవడంతో రెండో కూతురు అంజిలమ్మతో కలిసి గ్రామంలోనే ఉంటున్నది. కుమారుడు, కోడలు మరో ఇంట్లో ఉంటున్నారు. అయితే, వర్షాల కారణంగా ఇల్లు కూలడంతో హన్మమ్మ(60), ఆమె కూతురు అంజమ్మ(40) మృతి చెందారు. విషయం తెలుసుకున్న తాసీల్దార్ అనిల్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీఐ దాసునాయక్, ఎస్సై రాంలాల్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కొడుకు అంజిలప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


ఒడ్డుకు చేరిన కాపరులతో నాగర్‌కర్నూల్ కలెక్టర్, ఎస్పీ

## దుందుభీ వాగులో దిగ్బంధం

- వరదలో చిక్కుకున్న ఇద్దరు కాపరులు, గొర్రెలు
- సురక్షితంగా తీసుకొచ్చిన కలెక్టర్, ఎస్పీ

తాడూరు/నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 1 : తాడూరు మండలంలోని సిర్సవాడ, పాపగల్ గ్రామాల మధ్యలోని దుందుభీ వాగుకు తీవ్ర వరద వస్తున్నది. ఈ వరదల్లో 200 గొర్రెలు, ఇద్దరు కాపరులు చిక్కుకున్నారు. వారిని కాపాడేందుకు కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. రోజు మాదిరిగానే సిర్సవాడ గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు మల్లయ్య, ఆంజనేయులు గొర్రెలను మేపేందుకు దుందుభీ సమీపంలోకి వెళ్లారు. ఒక్కసారిగా వాగు ఉధృతంగా రావడంతో వాగు మధ్యలో ఉన్న గడ్డపైకి గొర్రెలతోపాటు చేరుకొని అక్కడే చిక్కుకుపోయారు. విషయం తెలుసుకున్న కలెక్టర్, ఎస్పీ ఆదివారం ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించారు. డ్రోన్ కెమెరా సాయంతో వాగు మధ్యలో ఉన్న కాపరులు, గొర్రెలను గుర్తించారు. సోమశిల నుంచి పుట్టీని, జాలరులను రప్పించి ఎట్టకేలకు గొర్రెల కాపరులను సురక్షితంగా కాపాడారు. గొర్రెలు మాత్రం అక్కడే ఉన్నాయి.


నారాయణపేట జిల్లాలో అలుగుపారుతున్న ఊట్కూరు పెద్దచెరువు



1. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలోకి భారీగా చేరిన వర్షపు నీరు
2. మహబూబ్‌నగర్ కురిహినిశెట్టి కాలనీలో ఇంటిలోకి చేరిన నీటిని తోడుతున్న మహిళ
3. నారాయణపేట జిల్లా ధన్వాడ మండలకేంద్రంలోని దళితవాడలో ఇండ్లల్లోకి చేరిన వర్షపు నీరు
4. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని శివాజీనగర్ కాలనీలో ఇండ్లలోకి చేరిన నీటిలో బిక్కుబిక్కుమంటూ చూస్తున్న వృద్ధురాలు

# ఒడవని వాన

- ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం
- ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణా, భీమా నదులు
- ఉప్పొంగిన వాగులు, వంకలు
- పలుచోట్ల నిలిచిన రాకపోకలు
- వందలాది ఎకరాల్లో పంట నష్టం
- నేడు విద్యాసంస్థలకు సెలవు


మానవపాడు : నీట మునిగిన వరిపంట
గద్వాల జిల్లా కేంద్రంలో ఇండ్ల మధ్యలో నిలిచిన నీరు
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో..
గోపాల్‌పేట : కేశంపేట–చెన్నారం మధ్య రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు
ఆత్మకూరు : అల్లీపూర్ వాగు బ్రిడ్జిపై పారుతున్న నీరు

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కుండపోత వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం జలదిగ్బంధంలో చిక్కుకున్నది. లోతట్టు ప్రాంతాల్లోని జనావాసాల్లోకి వరద నీరు రావడంతో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. జడ్చర్ల పట్టణంలో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నది. నారాయణపేట జిల్లాలో మట్టి మిద్దె కూలి తల్లీకూతురు మృతిచెందారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణా, భీమా, దుందుభీ నదులతోపాటు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కోయిల్‌సాగర్, సరళాసాగర్, రామన్‌పాడు, శంకర సముద్రం రిజర్వాయర్లు నిండిపోవడంతో గేట్లను ఎత్తి దిగువకు నీరు వదులుతున్నారు. వరదల్లో చిక్కుకున్న ఇద్దరిని పోలీసులు స్థానికుల సాయంతో సురక్షితంగా కాపాడారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో మరో ఇద్దరు గొర్రెల కాపరులు 200 గొర్రెలతో సహా వాగులో చిక్కుకోగా కలెక్టర్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. హన్వాడ సమీపంలోని ఇబ్రహీంబాద్ వద్ద మహబూబ్‌నగర్–తాండూర్ జాతీయ రహదారి తెగిపోవడంతో రాకపోకలు నిలిపివేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో శ్రీశైలం హైవేను తాత్కాలికంగా నిలిపివేశారు. వాగులు, వంకలు, చెరువులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో అనేక ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో పంట నష్టం సంభవించింది. ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు, ఎస్పీలు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు ఉండడంతో సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. మహబూబ్‌నగర్, హన్వాడ మండలాల్లో భారీ వర్షాలకు నీట మునిగిన కాలనీలను తెగిపోయిన రహదారిని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. మరోవైపు భారీ వర్షాల కారణంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరెంట్ కోతలు విధించారు. వర్షాల ప్రభావంతో ట్రాన్స్‌కో సిబ్బంది ముందస్తుగా పవర్ కట్ చేయడంతో అనేక గ్రామాలు చీకట్లో మగ్గుతున్నాయి.

**జలదిగ్బంధంలో పాలమూరు**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం జలదిగ్బంధంలో చిక్కుకున్నది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పాలమూరు పట్టణం పూర్తిస్థాయిలో తడిసి ముద్దయింది. రోడ్లన్నీ జలమయంగా మారాయి. ఎడతెరిపిలేని వర్షాలకు రహదారులు కాల్వలను తలపిస్తున్నాయి. పెద్ద చెరువు కొత్తచెరువు అలుగు పారుతుండడంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను వరద ముంచెత్తుతున్నది. జడ్చర్ల సమీపంలోని పెద్దగుట్టపై కొండ చరియలు విరిగిపడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మక్తల్ నియోజకవర్గంలోని ఊట్కూరు పెద్ద చెరువు అలుగు పారడంతో పంటలన్నీ నీట మునిగాయి. మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో కూడా పెద్ద ఎత్తున పంట నష్టం సంభవించింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో కేఎల్ఐ కాల్వలు తెగిపోగా పంట పొలాలను వరద ముంచెత్తడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.


ఉప్పునుంతల : మొల్గర వద్ద దుందుభీ పరవళ్లు

**ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత**

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు గేట్లు అన్ని ఎత్తి 3,500 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. కందూరు వాగు ఉప్పొంగడంతో వనపర్తి జిల్లాలోని సరళాసాగర్ ప్రాజెక్టు గేట్లు ఆటోమెటిక్‌గా తెరుచుకున్నాయి. దీంతో కొత్తకోట–ఆత్మకూరు మధ్య రాకపోకలు నిలిపివేశారు. మరోవైపు వనపర్తి జిల్లాలోని శంకరసముద్రం గేట్లను కూడా ఎత్తివేశారు. రామన్‌పాడు గేట్లు కూడా ఓపెన్ చేశారు. నది ఉప్పొంగడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లు, ఎస్పీలు సూచిస్తున్నారు.

## పుట్టి సాయంతో..

- పశువుల కాపరులను కాపాడిన అధికారులు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 1 : మండలంలో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెన్నపురావుపల్లి గ్రామ సమీపంలోని పెద్ద చెరువు నిండింది. అదే గ్రామానికి చెందిన రామస్వామి తన కొడుకు రామకృష్ణ, బిడ్డ రేణుక ఇద్దరు మూగవాళ్లు. వీరితో కలిసి పెద్ద చెరువుకు నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ పొలానికి వెళ్లారు. శనివారం తిరిగి వచ్చే సమయంలో వర్షం భారీగా రావడంతో వారు వ్యవసాయ పొలం దగ్గరే ఉండిపోయారు. ఆదివారం తన వ్యవసాయ పొలం నుంచి ఇంటికి వస్తుండగా పెద్ద చెరువులోకి ఉధృతంగా నీరు వస్తుండడంతో వారు చెరువు దాటలేకపోయారు. దీంతో కుటుంబసభ్యులు ఈ విషయాన్ని మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డికి తెలిపారు. దీంతో ఆయన ఎస్సై సతీశ్, తాసీల్దార్ ఇబ్రహీం అలీకి సమాచారం ఇవ్వగా వారు పుట్టి సాయంతో జాలర్లు, రెస్క్యూటీంతో కలిసి వెళ్లి పశువుల కాపరులను ఒడ్డుకు తీసుకొచ్చారు. అధికారులు వెంటనే స్పందించి పశువుల కాపరులను కాపాడడంతో రామస్వామి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.


పుట్టి సాయంతో పశువుల కాపరులను ఒడ్డుకు చేర్చిన జాలర్లు

## రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- తెగిన రోడ్డు, లోతట్టు ప్రాంతాల పరిశీలన

హన్వాడ/మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 1 : తెగిపోయిన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి ఇబ్రహీంబాద్ సమీపంలోని చించోలి– మహబూబ్‌నగర్ ప్రధాన రహదారి తెగిపోవడంతో ఆదివారం శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చించోలి–మహబూబ్‌నగర్ రోడ్డుపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రోడ్డు తెగిన వెంటనే మరమ్మతులు నిర్వహించకుండా అధికారులు నిర్లక్ష్యం వహించడం ఏమిటని మండిపడ్డారు. నేను మంత్రిగా ఉన్నప్పుడు మండలంలోని వేపూర్, గొండ్యాల వాగుపై నాలుగు చెక్‌డ్యాంలు మంజూరు చేయించానని వాటికి సంబంధించిన పనులు నేటికీ ప్రారంభించలేదని, ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టిన వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం పెద్దదర్పల్లి, హన్వాడ చెరువులు అలుగుపారడంతో వాటిని పరిశీలించి పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, మాజీ ఎంపీటీసీలు నాగన్న, చెన్నయ్య, మాజీ జెడ్పీటీసీ నరేందర్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మయ్య, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జంబులయ్య, మాజీ సర్పంచులు వెంకన్న, చిన్నచెన్నయ్య, నాయకులు అన్వర్, రామ్‌గౌడ్, మాధవులు గౌడ్, శ్రీనివాసులు, అనంతరెడ్డి, తేజవర్ధన్, యాదయ్య ఉన్నారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాసకాలనీలో నీట మునిగిన ప్రాంతాలను మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. స్థానికులకు తాను అండగా ఉన్నానని భరోసా కల్పించారు. ఆయన వెంట స్థానిక కౌన్సిలర్ పటేల్ ప్రవీణ్‌తోపాటు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



హన్వాడ మండలంలో కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


మూసాపేట : అలుగుపారుతున్న శాఖాపూర్ చెక్‌డ్యాం


శంకరసముద్రం గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

## ఉప్పొంగుతున్న ప్రాజెక్టులు

గద్వాల/అయిజ/మక్తల్/దేవరకద్ర/శ్రీశైలం, సెప్టెంబర్ 1 : మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతోపాటు జూరాలకు ఎగువన కురుస్తున్న వర్షాలకు కృష్ణానదికి భారీ వరద వస్తున్నది. ఈ నేపథ్యంలో ఆదివారం జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 3,82,000 కూసెక్కులు నమోదు కాగా 45 గేట్లు ఎత్తి 3,88,683 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 47,124 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 13,475 క్యూసెక్కులు నమోదైంది. ఆర్డీఎస్ ఆనకట్టకు 6,658 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 6,020 క్యూసెక్కుల వరద నీరు సుంకేసుల బ్యారేజీకి చేరుతోంది. ఆర్డీఎస్ ఆయకట్టుకు 638 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 1,72,739 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 1,76,651 క్యూసెక్కులు నమోదైంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 1,30,000 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 1,02,250 క్యూసెక్కులు నమోదైంది. చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సంగంబండ)కు వరద భారీగా వస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు అధికారులు ఆదివారం నాలుగు గేట్లు ఎత్తి పదివేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వస్తున్న నేపథ్యంలో ఆదివారం ప్రాజెక్టు అధికారులు 13 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో బండర్‌పల్లి వాగులో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బండర్‌పల్లి, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు సందర్శకుల తాకిడి పెరిగింది. శంకర సముద్రానికి కూడా వరద వస్తుండడంతో 5 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. శ్రీశైలం జలాశయానికి ఎగువనుంచి 5,02,244 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో పది గేట్లను ఎత్తి 4,06,242 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. దీంతో గేట్లు, విద్యుదుత్పత్తితో కలిపి మొత్తం 4,74,305 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది.


కోయిల్‌సాగర్ గేట్ల నుంచి దిగువకు పారుతున్న వరద